క్లుప్తంగా

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



కుమరాంలో అక్షతలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి, తదితరులు

జామి: అయోధ్య శ్రీరాముడి పూజిత అక్షతలను మండలంలోని కుమరాం గ్రామంలో సమరసతసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు.ఈనెల 22న అయోధ్య రామమందిరం ప్రతిష్ట నిర్వహించనున్న నేపథ్యంలో ముందుగా గ్రామంలో అక్షతలను ఊరేగించారు. అక్షతలతో పాటు అయోధ్య రామమందిరం ఫొటో, వివరా లతో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయ డైరెక్టర్ తోట మధుసూధనరావు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పిన్నింటి రవి, సమరసతసేవ ఫౌండేషన్ మండల గౌరవ కన్వీనర్ బి.అప్పలరా జు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో మోటారుబోరు ప్రారంభం



మోటారు బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ యశోద

వేపాడ: బానాది గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో తవ్వించిన బోరు నుంచి రన్నింగ్ వాటర్ అందించేందుకు పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన మోటారును గ్రామసర్పంచ్ కర్రి యశోద బుధవారం ప్రారంభించారు. సర్పం చ్ మాట్లాడుతూ లేఅవుట్‌లో గృహ నిర్మాణ లబ్ధిదారులకు నీటి సౌక ర్యం కల్పించేందుకు రూ.30 వేలతో మోటారు ఏర్పాటు చేశామని చెప్పారు.

విద్యార్థులకు గాలిపటాల పోటీలు



విద్యార్థులతో గాలిపటాలు ఎగురవేయిస్తున్న ఆశయ రమణ

చీపురుపల్లి: ముక్కనుమ పండగ నేపథ్యంలో పట్టణంలోని జి.అగ్రహారంలో ఆశయ యూత్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం గాలిపటాల పోటీలు నిర్వహించారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ పూర్వం సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఎన్నో సాంప్రదాయ క్రీడలు ఆడేవారని, కాలానుగుణంగా అవన్నీ కనుమరుగైపోయాయన్నారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే సాంప్రదాయలపై అవగాహన కల్పించేందుకు గాలిపటాల పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

నేటి నుంచి శిక్షణ

బొండపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామైక్య సంఘాల సభ్యులు హాజరు కావాలని కోరారు.

అంబేడ్కర్ చిరస్మరణీయుడు

విజయనగరం ఫోర్ట్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతివనాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 19న ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సుమారు 19 ఎకరాలలో దాదాపు 400 కోట్ల రుపాయల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం, కాంస్య విగ్రహం చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బాల కేంద్రంలో అడ్మిషన్లు ప్రారంభం

విజయనగరం టౌన్: బాలకేంద్రంలో ఈ ఏడాది శిక్షణ పొందేందుకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు జిల్లా బాలకేంద్రం సూపరింటిండెంట్ బుర్రా శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న బాలకేంద్రంలో శాస్త్రీయ సంగీతం, భరతనాట్యంలో శిక్షణ ఇస్తామని.. ఔత్సాహిక బాల, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 94415 72195 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో వైభవంగా తీర్థమహోత్సవాలు

జామి: మండలంలోని ఎం.కెవలస గ్రామంలో కన్నమ్మతల్లి, శిరికిపాలెంలో కొత్తమ్మతల్లి పేరంటాలు, చింతాడలో మల్లికార్జునస్వామి తీర్థమహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవార్లను, మల్లికార్జున స్వామిని దర్శించుకు న్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు పసుపు, కుంకమ, గాజులు,చీరలు, రవికలు సమర్పించి మొక్కులు చెల్లిం చుకున్నారు. ఎం.కె.వలస జాతరకు బలరాంపురం,కుమరాం,భీమసింగి పాట్నూరు తదితర గ్రామాల నుంచి, శిరికిపాలెం జాతరకు అలమండ, కలగాడ,భీమాళి తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవ కమిటీలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశాయి.

అంకమ్మ పేరంటాల తీర్థం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం పంచాయతీ పరిధి బక్కునాయుడుపేటలో గ్రామదేవత అంకమ్మపేరంటాల తీర్థం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పందాల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంబరాలు పూర్తికాగానే మండలాల్లో తీర్థమహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సంక్రాంతి నుంచి ఉగాది వరకు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు కొనసాగుతుంటాయి.



వేపాడ: ముకుందపురంలో సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న జనసందోహం

జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు

వేపాడ: మండలంలోని ముకుందపురం గ్రామంలో వేంకట జగన్నాథస్వామి తీర్థమహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి కనకరాజు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



శృంగవరపుకోట: బక్కునాయుడుపేటలో ఎడ్ల పరుగు పోటీలు



జామి: ఎం.కె.వలసలో కన్నమ్మ తల్లి తీర్థమహోత్సవంలో భక్తుల సందడి



వేపాడ: ముకుందపురంలో పట్టువస్త్రాలంకరణలో జగన్నాథస్వామి

కనకదుర్గమ్మను దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు





అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ రఘురాజు

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్ వద్ద గల కనకదుర్గమ్మను గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్ వేమలి రమణమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారాయణమూర్తిరాజు, పి.నారాయణమూర్తి, కిలపర్తి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు, పంచెల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, అనంతం దంపతులు

చీపురుపల్లి: సంక్రాంతి పండగ నేపథ్యంలో మండలంలోని పుర్రేయవలస గ్రామంలో పేదలకు పంచెలు, చీరలను ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం దంపతులు బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రామలింగాపురం, పుర్రే యవలస గ్రామాల్లో ఏటా సంక్రాంతికి ప్రజలకు కానుకలు అందజేస్తున్నామని చెప్పారు. మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని తెలిపారు. పుర్రేయవలస గ్రామంలో భూములకు తోటపల్లి కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేస్తు న్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారని పేర్కొన్నారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కంది అప్పారావు, సిరేల రాములు, సారిక ఆనంద్, కంది త్రినాథ్, శ్రీరాములు, దుర్గారావు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

బొండపల్లి: ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జాబ్ కో–ఆర్డినేటర్ జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న వారికి జిల్లా కేంద్రంలో ఉచిత వస తి, భోజన సదుపాయం కల్పించి వివిధ అంశాలపై మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం వివిధ సంస్థలతో పాటు కంపెనీల్లో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. హోటల్ మేనేజ్మెంట్, ప్రొడక్షన్ కెమిస్ట్రీ, రిటైల్ ట్రెనింగ్, సాఫ్ట్‌వేర్, నర్సింగ్‌లో శిక్షణ ఇస్తామని వివరించారు శిక్షణ అనంతరం డిమార్ట్, జూడియో, రెడ్డీస్, అరవింద్, మైలాన్ వంటి కంపెనీల్లో ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఆసక్తి ఉన్నవారు వివరాల కోసం 96668 02851 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సుందరపేటలో ముగ్గుల పోటీలు



విజేతలతో వైఎస్సార్‌సీపీ నాయకుడు హరీష్

భోగాపురం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని సుందరపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, దివంగత సుందర గోవిందరావు జ్ఞాపకార్థం ఆయన తనయుడు వైఎస్సార్‌సీపీ మండల యువజన నాయకుడు సుందర హరీష్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలు, సంక్రాంతి శోభ ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సుందర వెంకటేష్, వెంకన్న, ఆళ్ల రమేష్, పోతిరెండి గోపి, ముద్దన శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సంబరాలను విజయవంతం చేయండి



డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశమైన ఏపీఎం సులోచనాదేవి

బొండపల్లి: వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా నాలుగో విడత రుణమాఫీకి సంబంధించిన డబ్బులను డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23న జమ చేయనున్నారని వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి తెలిపారు.

అంబటివలస గ్రామంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలస్థాయి ఆసరా సంబరాలను వచ్చే నెల 3వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సంబరాలకు డ్వాక్రా సంఘాల సభ్యులు హాజరై విజ యవంతం చేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

16,180 మందికి రూ.8.06 కోట్లు

గజపతినగరం: మండలంలోని 16,180 మంది డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత రుణమాఫీలో భాగంగా రూ.8.06 కోట్లు జమకానున్నాయని వెలుగు ఏపీఎం యు.జగదీష్‌కుమార్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఆసరా లబ్ధిదారులకు నిధుల విడుదలకు సంబంధించి సమా చారం అందిస్తున్నామని తెలిపారు. ఈనెల 23న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా నాలుగో విడత నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తారని, ఆ కార్యక్రమాన్ని డ్వాక్రా సంఘా ల గ్రూప్‌లు ప్రచార మాద్యమాల్లో వీక్షించాలని సూచించారు. 16,180 మందికి నాలుగు విడతల్లో కలిపి రూ.32.24 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. గజపతినగరం గ్రామ సచివాలయం–2 పరిధిలోని గజపతినగరం, ఎం.వెంకటాపురం, దావాలపేట, బూడిపేట తదితర గ్రామాల్లో వీఓఏలు, మహిళా వలంటీర్లు బుధవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి బొట్టు పెట్టి ఆసరా పథకంలో భాగంగా మూడు విడతల్లో అందుకున్న, నాలుగో విడతలో అందుకోనున్న నగదు వివరాలను వివరించారు.



దావాలపేటలో లబ్ధిదారులకు బొట్టుపెట్టి నాలుగో విడత ఆసరాపై అవగాహన కల్పిస్తున్న వీఓఏలు, వలంటీర్లు

ప్రజోపయోగ పనులకు ప్రాధాన్యం



దత్తిరాజేరు: శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది

- గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

గంట్యాడ: గ్రామ పంచాయతీలు తమకు అందుబాటులో ఉన్న వనరులు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని సద్వినియోగించుకుని ప్రజోపయోగ పను లు చేపట్టాలని ఎంపీపీ పీరుబండి హైమావతి సూచించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యద ర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బం దికి బుధవారం శిక్షణ నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి, ఆవివరాలను ఈ–గ్రామస్వరాజ్య యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులతో చర్చించి పనులను గుర్తించాలన్నారు. ఎంపీడీఓ వై.భవాని, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం

జామి: అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని జెడ్పీటీసీ గొర్లె సరయు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సతీష్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ నర్సింహులు, ఈఓపీఆర్డీ శ్రీదేవి ,పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమష్టిగా అభివృద్ధి చేద్దాం

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా, సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక అన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండురోజుల పాటు నిర్వ హించనున్న శిక్షణ తరగతులను గజపతినగరం మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను ప్రజాప్రతినిధులతో చర్చించి గుర్తించాలని చెప్పారు. జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీడీఓ కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ వాణిశ్రీ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం వివరించారు.



జామి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సరయు



గంట్యాడ:శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి



మెంటాడ(గజపతినగరం రూరల్): మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం



బాధితులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: అయ్యన్నపేటలోని చెంచుల కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అండగా నిలిచారు.

బుధవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయం కింద బియ్యం, దుస్తులు, కొంత నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెంచుల కాలనీలో ఆరు ఇళ్లు దగ్ధం కావడం విచారకరమన్నారు. బాధితులకు అవసరమైన సహాయం అందించడమే కాకుండా పక్కా ఇళ్లు మంజూరయ్యే విధంగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

దన్నాన పేటలో చోరీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేటలో విద్యుత్ సామగ్రిని గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. గ్రామానికి మంచినీటిని సరఫరా చేసేందుకు పంపింగ్ ఆపరేటర్ అచ్చప్పుడు బుధవారం ఉదయం వెళ్లగా షెడ్డు తాళం విరగ్గొట్టడాన్ని గమనించి వెంటనే సర్పంచ్ గేదెల రామచిరంజీవి, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కు సమాచారం అందించాడు. దీంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. మంచి నీటిని సరఫరా చేసే ప్యానెల్ బోర్డుతో పాటు మరో నాలుగు విలువైన విద్యుత్ కటౌట్‌లు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సర్పంచ్ ఫిర్యాదు చేశారు.